ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 30.0 । కనిష్ఠం : 21.0


ANDHRAJYOTHY

5

నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

సోమవారం 24 నవంబరు 2025





పట్టాలు దాటుతున్న పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు

పథకం ప్రకారమే మాజీ సర్పంచ్ హత్య?

- నెలరోజులుగా రెక్కీ
- పోలీసుల అదుపులో సుపారీ నిందితులు
- శోకసంద్రం నడుమ మాజీ సర్పంచు అంత్యక్రియలు



నందిన్నె గ్రామంలో మాజీ సర్పంచు అంత్యక్రియల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు (ఫైల్)

7

గమ్యం చేరాలంటే.. పట్టాలు దాటాల్సిందే

- ఆరు నెలల్లోనే కుంగిన రైల్వే అండర్ బ్రిడ్జి
- పరిశీలించి మూసివేసిన అధికారులు
- ఇబ్బంది పడుతున్న పాలమూరు నగర ప్రజలు

7



వనభోజన కార్యక్రమానికి హాజరైన జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి నుషిత

హాస్టల్ విద్యార్థుల వనభోజనాలు

గద్వాల న్యూటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని అన్ని వసతిగృహాలలో ఆదివారం సంక్షేమ వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహ విద్యార్థినులు రాజీవ్‌మార్గ్‌లోని స్మృతివనంలో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఆటలు, పాటలతో ఎంజాయ్ చేశారు. అనంతరం విద్యార్థులు, వార్డెన్‌తో కలిసి భోజనాలు ఆరగించారు. అలాగే ఎస్సీ-ఏ, ఆనందనిలయం బాలుర వసతిగృహాలలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియయంలో కోకో, రన్నింగ్‌తో పోటీలు నిర్వహించారు. అనంతరం అక్కడే వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి నుషిత, విద్యార్థులు, వార్డెన్లు కూడా అక్కడే భోజనం చేశారు.



కుమ్మరోనిపల్లి వద్ద రక్షణ గోడలేని కల్వర్టు

సాహస ప్రయాణం..

- ప్రమాదకరంగా మద్దిమడుగు రహదారి
- మరో పది రోజుల్లో స్వామివారి బ్రహ్మోత్సవాలు
- రక్షణ గోడలు లేక భయంకరంగా మారిన కల్వర్టు
- ప్రాణాలుపోతున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు

6

సా...గుతున్న మరమ్మతు

ఐదేళ్లుగా కల్వకుర్తి మోటార్లు, శ్రీశైలం నాలుగో యూనిట్ దుస్థితి ఇది


- మరమ్మతు చేయడానికి ఇరిగేషన్, జెన్‌కో అధికారుల ఆపసోపాలు
- వరద వస్తున్నా మరమ్మతు చేయడానికి మిషన్ భగీరథ అడ్డంకులు
- స్టేటర్, రోటర్ గ్యాప్ తగ్గడంతో 4వ యూనిట్ పునరుద్ధరణ ఆలస్యం
- నిర్మాణ, నిర్వహణ లోపాలతో ప్రభుత్వాలకు నష్టం.. ఆర్థిక భారం



శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో మరమ్మతులో ఉన్న నాలుగో యూనిట్(ఫైల్)

మహబూబ్‌నగర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తెలంగాణ భౌగోళికంగా నదుల నుంచి గ్రావిటీ ద్వారా నీరు తరలించడానికి అనుకూలంగాలేదు. ఈ కారణంగా అటు గోదావరి, ఇటు కృష్ణానదిపై ఎత్తిపోతల పథకాలు నిర్మించడం తప్పా గత్యంతరం లేని పరిస్థితి. అయితే ఈ పథకాల్లో భారీ సామర్థ్యం కలిగిన మోటార్లను వినియోగించడం వల్ల నిర్వహణ భారం అధికమవుతోంది. అ దే సమయంలో మోటార్లు ఏదైనా ప్రమాదానికి గురై దెబ్బతింటే వాటిని మరమ్మతు చేయ డం ఒక సుదీర్ఘ ప్రక్రియగా మారుతోంది. అందుకు ప్రత్యక్ష

(మిగతా 6లో..)



మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం నుంచి విడుదలవుతున్న నీరు

స్టేటర్- రోటార్‌ల మధ్య తగ్గిన గ్యాప్...

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పునరుద్ధరణ పూర్తి చేయాలని ఆదేశించడంతో బ్లాక్ లిస్టులో పెట్టిన అదే కంపెనీకి రూ. 3 కోట్ల అదనపు ఖర్చు భరిస్తామని చెప్పి పనులు చేయించింది. ఈ ఏడాది సెప్టెంబరు 17న స్టేటర్ బిగించి అక్టోబరు 2 విజయదశమి రోజున నాలుగో యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించారు. దాదాపు 10 గంటలపాటు విద్యుత్ ఉత్పత్తి జరుగకముందే ఆ యూనిట్‌లో సాంకేతిక లోపం ఏర్పడటంతో మళ్లీ మొరాయించింది. స్టేటర్, రోటర్ల మధ్య 17 సెంటీమీటర్ల ఎయిర్ గ్యాప్ ఉండాలి. కానీ, 11 నుంచి 12 సెంటీమీటర్లు మాత్రమే ఉన్నది. దీంతో యూనిట్‌ను రన్ చేసినప్పుడు వైబ్రేషన్ రావడం, ఎయిర్ గ్యాప్ తగ్గడం వల్ల స్టేటర్ వేడెక్కడంతో వైండింగ్ బార్స్ కాలిపోతున్నట్లు ఇంజనీర్లు, ఉద్యోగులు ముందే గుర్తించి వాయిత్ కంపెనీ సిబ్బందిని హెచ్చరించారు. అయినా వాయిత్ కంపెనీ జనరేటింగ్ డిజైన్ ఇంజనీరింగ్ బృందం పట్టించుకోకపోవడంతో సమస్య మొదటికొచ్చింది. ప్రస్తుతం స్టేటర్ ప్యాకింగ్ కవర్ విప్పారు. వాయిత్ కంపెనీ టెక్నికల్ ఇంజనీర్ వచ్చిన తర్వాత పరీక్షిస్తే తప్ప ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

సర్పంచు రిజర్వేషన్లు ఖరారు

- ఎన్నికల కార్యాచరణ ప్రారంభించిన అధికారులు
- బీసీ జనరల్ స్థానాలలో మార్పులు



గద్వాలలో డిప్పు ద్వారా మహిళా రిజర్వేషన్లను ఖరారు చేస్తున్న ఆర్డీవో, అదనపు కలెక్టర్ డీపీవో అధికారులు

గద్వాల/వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచు ఎన్నికల ఉత్కంఠకు ప్రభుత్వం తెరదించింది. గత నెలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో ఖరారు చేసిన రిజర్వేషన్లను రద్దు చేసి కొత్తగా రిజర్వేషన్ల పద్ధతి ఖరారు చేస్తూ శనివారం జీవో విడుదల చేసింది. ఎస్సీ ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం, బీసీలకు కులగణన సర్వే ఆధారంగా రిజర్వేషన్లను అమలుచేయాలని ఆదేశించడంతో జిల్లాలో అధికారులు వాటిని ఖరారు చేసే పనిలో బిజీ అయ్యారు. ఆదివారం కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశం మేరకు ఆర్డీవో అలివేలు సమక్షంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఇన్‌చార్జి డీపీవో నాగేంద్రం వీడియో గ్రఫీ ద్వారా రిజర్వేషన్లను ఖరారు చేశారు. వివిధ పార్టీల నాయకులు హాజరు కాగా మహిళా రిజర్వేషన్లను డిప్పు ద్వారా ఎంపిక చేశారు. జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా ఎస్సీలకు 51, ఎస్టీలకు 5, బీసీలకు 70, అన్ రిజర్వ్‌డ్ స్థానాలు 129గా నిర్ధారించారు. ఇందులో ఎస్సీ మహిళలకు 21, ఎస్సీ జనరల్ స్థానాలు 30, ఎస్టీ మహిళ ఒకటి, ఎస్టీ జనరల్ 4 స్థానాలను కేటాయించారు. బీసీ మహిళలకు 32, బీసీ జనర్ స్థానాలు 38, అన్‌రిజర్వ్‌డ్‌లో మహిళలకు 62, జనరల్ స్థానాలు 67గా నిర్ధారించారు. జిల్లాలో మొత్తం 2,390 వార్డులు ఉండగా వాటికి ఆయా మండల ఎంపీడీలు డిప్పు ద్వారా రిజర్వేషన్‌లను ఖరారు చేశారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో గ్రామాల్లో ఎన్నికల వేడి పెరిగింది. ఆశావహులు వారివారి అధినాయకులతో మంతనాలు ప్రారంభించారు.

వనపర్తి జిల్లాలోని 268 పంచాయతీలకు...

వనపర్తి జిల్లాలోని 268 గ్రామ పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు చేస్తూ కలెక్టర్ గెజిట్ విడుదల చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 2011 జనాభా లెక్కల ప్రకారం రొటేషన్ పద్ధతిలో, బీసీ రిజర్వేషన్లు డెడికేషన్ కమిషన్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం కేటాయించినట్లు ఆర్డీవో తెలిపారు. ఈ రోజు ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీలకు సంబంధించిన మహిళా రిజర్వేషన్లను రాజకీయ నాయకుల సమక్షంలో డిప్ ద్వారా కేటాయించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ వార్డులకు సంబంధించిన రిజర్వేషన్లు ఎంపీడీవోల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు అధికారుల తెలిపారు.

నేడు భౌరాపూర్ పెంటకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

6

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

- అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వాములు

7

పోస్టర్ డిజైన్‌లో రాష్ట్రస్థాయి విజేతగా విష్ణువర్ధన్

- గవర్నర్ చేతుల మీదుగా సన్మానం

పాత పద్ధతి జీవో ద్వారా బీసీలకు అన్యాయం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవింద స్వామి

6

రైతులపై రాజకీయం వద్దు

- మొక్కజొన్న కొనుగోలులో ఎమ్మెల్యే విజయుడు



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 120.00
హోల్ సేల్	: 129.00
డ్రెస్డ్	: 203.00
స్కిన్ లెస్	: 231.00

నెరవేరిన సొంతింటి కల



అల్వాల్‌పాడులో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల

ధరూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి):ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద ప్రజల సొంతింటి కల ఇందిరమ్మ రాజ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో సాధ్యమైందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని అల్వాల్‌పాడులో 'ఇందిరమ్మ ఇల్లు' గృహ ప్రవేశానికి ఆదివారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 'ఇందిరమ్మ ఇల్లు' గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 'ఇందిరా మహిళా శక్తి' చీరలను పంపిణీ కార్యక్రమానికి హాజరై చీరలు పంపిణీ చేశారు. మహిళలను ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తార న్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్, మాజీ వైస్‌ఎంపీపీ రామకృష్ణ నాయుడు, నాయకులు మైలగడ్డ చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రేవల్లి/గోపాల్‌పేట, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లాలోని ఏదుల మండలంలోని చీరకపల్లి, గాంధీనగర్, గోపాల్‌పేట మండలంలోని చెన్నూరులో నిర్మాణం పూర్తి చేసుకున్న 'ఇందిరమ్మ ఇళ్ల' గృహ ప్రవేశాలకు ఆయన హాజరయ్యారు. ఆయా ఇళ్ల యజమానులకు నూతన దుస్తులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ పేదవారికి సొంత ఇంటి కల ఇందిరమ్మ ప్రభుత్వంలోనే సాధ్యమవుతోందన్నారు. గ్రామస్థులతో మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు ఎదురైనా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యశిలారెడ్డి, రేవల్లి మండల అధ్యక్షుడు పర్వతాలు, శివన్న, కేతపల్లి వెంకటయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



గృహ ప్రవేశం సందర్భంగా దంపతులకు నూతన దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ఆరోగ్య తెలంగాణ కోసం పని చేయాలి

- తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవిత
- నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వని బీఆర్‌ఎస్
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఇళ్లు ఇవ్వాలి



కానాయపల్లి నిర్వాసితులతో మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవిత

వనపర్తి వైద్యవిభాగం/కొత్తకోట/పెబ్బేరు రూరల్/పెబ్బేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య తెలంగాణ కోసం ప్రభుత్వం పనిచేయాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం వనపర్తి జిల్లాలో ఆమె పర్యటించారు. వనపర్తి పట్టణంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం, కొత్తకోట మండలంలోని శంకర సముద్రం రిజర్వాయర్, పెబ్బేరు మండలంలోని వ్యవసాయ మార్కెట్, పాతపల్లిలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఎంతో చక్కగా నిర్మించినప్పటికీ సిబ్బంది కొరతతో సరైన వైద్యం అందించడం లేదని అన్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. శంకర సముద్రం రిజర్వాయర్ నిర్మాణంలో నిర్వాసితులకు ప్లాట్లు కాదు.. ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం భవానీ మాతను దర్శించుకున్నారు. పాతపల్లిలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నేటికీ పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. నిరుపేదలకు ఇవ్వాల్సిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో బీఆర్‌ఎస్ నాయకులు ఒక్కొక్కరి నుంచి రూ.80 వేలు వసూలు చేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. పెబ్బేరు మార్కెట్ యార్డు పరిశీలన సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో అధికార యంత్రాంగం కాలయాపన చేయడం తగదని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి సభ్యులు, ఆసుపత్రి ఆర్‌ఎంవో డాక్టర్ బంగారయ్య, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

ఆనందంలో నేతన్నలు

- రూ.1లక్ష రుణమాఫీకి నిధులు విడుదల చేస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు
- వనపర్తి జిల్లాలో 338 మంది కార్మికులకు లబ్ధి



అమరచింత చేనేత కంపెనీలో మగ్గాలు

అమరచింత, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగు నింపడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా రైతు రుణమాఫీ మాదిరిగా చేనేత కార్మికులకు కూడా రుణమాఫీ ప్రకటించింది. ఇచ్చిన మాట ప్రకారం రెండు రోజుల క్రితం రాష్ట్ర ఆర్థికశాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు రూ.33 కోట్ల నిధులను విడుదల చేసింది.దీంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2017 తరువాత ఆయా బ్యాంకుల్లో చేనేత కార్మికులు తీసుకున్న లక్ష లోపు రుణాలు మాఫీ కానున్నాయి. వనపర్తి జిల్లాలో 336 మంది నేత కార్మికులు లబ్ధిపొందనున్నారు. ఇందులో అమరచింత, ఆత్మకూరు, తిప్పడంపల్లి, కొత్తకోట, ఖిల్లాఘణపూర్, సోలీపూర్, వెల్టూరు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఉన్నారు. జిల్లాలో 1000 దాకా కార్మికులు ఉండగా అందులో 336 మందికి జియో ట్యాగ్ కలిగి ఉన్నారు. ప్రభుత్వం 2017 నుంచి లక్షలో రుణాలు తీసుకున్న కార్మికులకు మాత్రం రుణమాఫీకి అర్హులుగా ప్రకటించింది. దీంతో జిల్లాలో 336 మందికి లబ్ధి పొందనున్నారు.

ఆనందంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల చేనేత రుణమాఫీ చేయడం ఆనందంగా ఉంది. చాలీచాలని డబ్బులతో జీవనం కొనసాగిస్తున్న చేనేత కార్మికులకు రుణమాఫీ చేయడం ఎంతో మేలు జరుగుతుంది.

\- పగడాకుల నరసింహ, నేత కార్మికుడు, అమరచింత

గద్వాల కవికి సాహితీ పురస్కారం

- సాహితీ మిత్రుల అభినందనలు

6

గచ్చుబావి కోనేరు పూడికతీతకు నిధులు

6

అటవీ సెక్షన్ అధికారికి అవార్డు

- ఎండీ ముజీబ్ ఘోరికి ఘన సన్మానం

సాహస ప్రయాణం

- ప్రమాదకరంగా మద్దిమడుగు రోడ్డు
- మరో పది రోజుల్లో స్వామివారి బ్రహ్మోత్సవాలు
- రక్షణ గోడలు లేక భయానకంగా మారిన కల్వర్టు ప్రాంతాలు
- ప్రాణాలుపోతున్నా పట్టించుకోని పాలకులు, అధికారులు


కుమ్మరోనిపల్లి వద్ద రక్షణ గోడలేకపోవడంతో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

పదర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మద్దిమడుగు ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. మరో పది రోజుల్లో మద్దిమడుగు ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు జరగబోతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొనడానికి అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రస్తుతం మద్దిమడుగు ప్రధాన రహదారి సింగిల్ రోడ్డు ఉంది. దానికి తోడు ఇటీవలే కురిసిన వర్షాలకు రోడ్లు కొన్ని చోట్ల పగిలిపోవడం, మరి కొన్ని చోట్ల రోడ్డు పక్కన మట్టి కొట్టుకపోయి అధ్వానంగా మారింది. అమ్రాబాద్ మండలం కుమ్మరోని పల్లి, పదర మండలంలోని రాయలగండి శివారు మధ్యలో ఉన్న కల్వర్టు పూర్తిగా పై పెచ్చు ధ్వంసం కావడంతో పాటు రక్షణ గోడలు లేకపోవడంతో మరింత ప్రమాదక పరిస్థితి నెలకొంది.

అదే విధంగా మండలంలోని వంకేశ్వరం - పదర మధ్యలో కల్వర్టు పగుళ్లు ఏర్పడింది. దాంతో ద్విచక్ర వాహనదారులతో పాటు, ఆటోలు, జీపులలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర భయ భ్రాంతులకు గురవుతున్నారు. గతంలో కుమ్మరోనిపల్లి కల్వర్టు దగ్గర ప్రాణాలు సైతం కోల్పోయారు. అదే విధంగా కార్తీకమాసంలో మంగళ, శని, ఆది వారాల్లో మద్దిమడు గు ఆంజనేయస్వామి దర్శనార్థం వస్తున్న భక్తులు కూడా తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే పాలకులు, అధికారులు మేల్కొని కల్వర్టు లు, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలతో పాటు మద్దిమ డుగు పబ్బతి ఆంజనేయస్వామి భక్తులు కోరుతున్నారు.

మా బావ ఇదే వాగులో చనిపోయిండు

మా బావ వెంకటయ్య దాదాపు పదేళ్ల క్రితం కుమ్మరోనిపల్లి కల్వర్టు దగ్గరే చనిపోయారు. అక్కడ పెద్ద బ్రిడ్జి కట్టి రక్షణ గోడలు నిర్మిస్తే బాగుంటది.

- దొడ్ల కృష్ణ యాదవ్, వంకేశ్వరం

మద్దిమడుగు వరకు డబుల్ రోడ్డు నిర్మించాలి

నల్లమలలోనే మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి టెంపుల్ చాలా ఫేమస్. బ్రహ్మోత్సవాల దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య చాలా పెరిగింది. ప్రతీ సంవత్సరం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతాయి. అందుకే మద్దిమడుగు వరకు డబుల్ రోడ్డు వెయ్యాలి.

- మల్లేష్, భక్తుడు

అటవీ శాఖ అధికారికి అవార్డు

» ఎండీ ముజీబ్ ఘోరికి ఘన సన్మానం


అటవీ శాఖ సెక్షన్ అధికారి ముజీబ్ ఘోరికి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందిస్తున్న టీ ఆల్ మేవా సంఘం అధ్యక్షుడు ఫారూక్ హుస్సేన్

కొల్లాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు కొల్లాపూర్ కార్యాలయంలో సెక్షన్ అధికారి ఎండీ ముజీబ్ ఘోరికి టీ ఆల్ మేవా సంఘం ఆధ్వర్యంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ మెమోరియల్ అవార్డు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా టీఆల్ మేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ టోలిచౌకిలో వీబీపీ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహించిన మైనార్టీ ఉద్యోగులకు అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ముజీబ్ ఘోరిని రాష్ట్ర బెస్ట్ ఎంప్లాయిగా ప్రకటించి అవార్డును రాష్ట్ర అధ్యక్షుడు ఫారూక్ హుస్సేన్ ప్రదానం చేశారు. యువ అటవీ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తూ పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని ఫారుక్ హుస్సేన్ అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిక్ అంసారి, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి ఎంజె అక్బర్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ వాహిద్ షా, వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతిని ధులు, మైనార్టీ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

మైసమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు


నాయినోనిపల్లి మైసమ్మ దేవతకు నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతను భక్తులు దర్శించుకున్నారు. బోనం కుండలో నైవేద్యం వండి, ఆ కుండను పసుపు కుంకుమలతో అలంకరించి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి దేవతకు నైవేద్యం సమర్పించారు. ఆలయానికి రూ.1,96,701 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి రామేశ్వర్‌శర్మ, ఆలయం చైర్మన్ బుడుగు శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. నాగర్‌కర్నూల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ పి.మదన్‌కుమార్, మైసమ్మ ఆలయాన్ని సందర్శించి భక్తుల సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

గచ్చుబావి కోనేరు పూడికతీతకు నిధులు


గచ్చుబావి కోనేరు నుంచి పూడికతీత పనులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని గచ్చుబావి శివాలయం కోనేరు కూడిక తీయడానికి మునిసిపల్ నుంచి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి రూ.10లక్షలు మంజూరు చేయించారు. ఆదివారం కోనేరు నుంచి పూడిక తీత పనులను మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 400 సంవత్స రాల చరిత్ర కలిగిన గచ్చుబావి శివాలయం అభివృద్ధికి యువ త పార్టీలకతీతంగా నాయకులు ముందుకు రావడం అభినందనీ యమని పేర్కొన్నారు. యువకులు శ్రమదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, సేవ్ గచ్చుబావి సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

» దేవునితిర్మలాపూర్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


దేవునితిర్మలాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో గల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2012-13 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు వివిధ వృత్తుల్లో స్థిరపడిన విద్యార్థులు ఆదివారం దేవునితిర్మలాపూర్ ఉన్నత పాఠశాలలో కలుసుకుని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూల మాలలతో ఘనంగా సన్మానించి పాదాభివందనాలు చేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన బి.సంగీత పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావడంతో తోటి విద్యార్థులు ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కొత్త శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజయ్య, ఉపాధ్యాయులు చాంద్‌పాషా, రాజశేఖర్, అజీమ్, కృష్ణమూర్తి, వేణుగోపాల్, ప్రశాంతి, బసవయ్య, పూర్వ విద్యార్థులు బి.సంగీత, కొనమోని లింగస్వామి, కుమ్మరి శివ, లక్ష్మీ, రాజేశ్వరి, సురేష్‌రెడ్డి, చెన్నమ్మ పాల్గొన్నారు.

గద్వాల కవికి సాహితీ పురస్కారం

» సాహితీ మిత్రుల అభినందనలు


భానుప్రకాష్‌కు పురస్కారం అందజేస్తున్న కురుమూర్తి ఆలయ కమిటీ బాధ్యులు

గద్వాల టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ అంబటి భానుప్రకాష్‌కు కురుమూర్తి దేవస్థానం వారు ఉత్తమ సాహితీ ప్రతిభ పురస్కారాన్ని అందజేశారు. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో సాగిస్తున్న కవిత్వ రచనతో పాటు సాహితీ సేవలకుగాను గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అంబటి భానుప్రకాష్‌ను ఘనంగా సన్మానించి ప్రతిభా పురస్కారం, జ్ఞాపికను అందజేశారు. సాహితీ పురస్కారం అందుకున్న కవి అంబటి భానుప్రకాష్‌కు సాహితీ మిత్రులు హనిమోని మహేందర్, నాయుడుగారి జయన్న, పూదత్తు భాస్కర్, మేడిచర్ల హరినాగ భూషణం, బీంపల్లి శ్రీకాంత్, మంగళగిరి శ్రీనివాసులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు పురస్కారాలు


హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో ఉత్తమ పురస్కారాలు అందుకుంటున్న సిర్సవాడ జిల్లా పరిషత్ విద్యార్థులు

తాడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు సంబంధించి ఆదివారం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రిటైర్డు ఐఏఎస్ రమణాచార్యులు చేతుల మీదుగా ఉత్తమ పురస్కారాలను అందజేశారు. కే.వీణ ప్రకృతత్వం అనే విభాగానికి సంబంధించి రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి పురస్కారం అందుకోగా, టోనీ 9వ తరగతి విద్యార్థి పద్యరచనకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో రెండవ బహుమతి అందుకున్నారు. దీక్షిత 9వ తరగతి పుస్తక సమీక్షా విభాగానికి సంబంధించి రాష్ట్రస్థాయిలో రెండవ బహుమతి అందుకోగా, సంధ్య 9వ తరగతి ఏకపాత్రాభినయం విభాగంలో రాష్ట్ర స్థాయిలో రెండవ బహుమతి అందుకున్నారు. వర్షిత 9వ తరగతి, భానుశ్రీ 9వ తరగతి, వీణ 6వ తరగతి పలు విభాగాలకు సంబంధించి కన్సోలేషన్ బహుమతులు అందజేశారని పాఠశాల జీహెచ్ఎం రమేష్ తెలిపారు. తెలుగు ఉపాధ్యాయుడు సత్యనారాయణను, విద్యార్థులను, ఉపాధ్యాయులను గ్రామస్థులు అభినందించారు.

లాక్రోస్ రాష్ట్రస్థాయి టోర్నీ విజేత మహబూబ్‌నగర్


లాక్రోస్ రాష్ట్రస్థాయి టోర్నీ విజేత మహబూబ్‌నగర్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మైత్రి మైదానంలో ఆదివారం నిర్వహించిన 1వ తెలంగాణ రాష్ట్ర లాక్రోస్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ జిల్లా పురుషుల జట్టు చాంపియన్‌గా నిలిచింది. రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లా విజేతగా నిలువడం పట్ల జిల్లా లాక్రోస్ అసోసియేషన్ ప్రతినిధి వెంకట్ రెడ్డి అభినందించారు.

వెంకటాయపల్లిలో జోరుగా ఫిల్టర్ ఇసుక

» పట్టించుకోని అధికారులు


గ్రామ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక

దేవరకద్ర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామం వాగు సమీపంలో ఫిల్టర్ ఇసుక జోరుగా కొనసాగుతోంది. ఈ విషయపై గ్రామస్థులు రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే అధికారులు నామమాత్రంగా ఫిల్టర్ ఇసుకపై దాడి చేస్తారని, తిరిగి ఇసుక మాఫియా యధావిధిగి ఫిల్టర్ ఇసుకను కొనసాగిస్తున్నారన్నారు. ప్రతీ రోజు రాత్రి పది గంటలకు నుంచి తెల్లవారుజాము వరకు ఫిల్టర్ ఇసుకను తయారు చేసి జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు ట్రాక్టర్‌కు రూ.5 వేల చొప్పున, టిప్పర్‌కు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం..

వెంకటాయపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఇసుక ఫిల్టర్ తయారీ కేంద్రంపై గతంతో చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం మరోసారి దాడి చేసి ఫిల్టర్ ఇసుక తయారీ కాకుండా చర్యలు తీసుకుంటాం. ఫిల్టర్ ఇసుకను రవాణా చేస్తే ట్రాక్టర్లు, జేసీబీలను సీజ్ చేస్తాం.

- దీపిక, తహసీల్దార్

సా...గుతున్న మరమ్మతు

(5వ పేజీ తరువాయి)

ఉదాహరణగా కల్వకుర్తి పంపుల మరమ్మతు ప్రక్రియను చెప్పవచ్చు. ఈ పథకాన్ని శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా చేపట్టగా 2020లో వరద ఎక్కువగా రావడంతో పాటు అప్రోచ్ కెనాల్ వద్ద షట్టర్లు లేకపోవడంతో వరద వచ్చి పంపులు నీట మునిగాయి. ఐదేళ్లుగా వరద పుష్కలంగా వస్తున్నప్పటికీ ఈ మోటార్లను తిరిగి అందుబాటులోకి తెచ్చి వినియోగించుకోలేని పరిస్థితి ఉన్నది. అలాగే శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో ఐదేళ్ల క్రితం అగ్నిప్రమాదం జరిగి నాలుగో యూనిట్ దెబ్బతిన్నది. హుటాహుటిన జెన్‌కో మరమ్మతు ప్రక్రియను చేపట్టినప్పటికీ ఇప్పటి వరకు రెండుసార్లు పునరుద్ధరణ అయినట్లే అయ్యి మళ్లీ ఆగిపోతోంది.

మరమ్మతు చేసే ఇంజనీర్లు ఇక్కడి వారు కాకపోవడం, బ్లాక్ లిస్టులో పెట్టిన కంపెనీకే మళ్లీ పనులు అప్పగించడం వంటి విమర్శలు కూడా ఉన్నాయి. అగ్నిప్రమాదం సంభవించిన తర్వాత నాలుగో యూనిట్ మరమ్మతు కావడం ఇది రెండోసారి. ఇప్పుడు కూడా ఎప్పటికీ పునరుద్ధరణ ప్రక్రియ పూర్తవుతుందో చెప్పలేమని అధికారులు చెబుతున్నారు.

నాసిరకం మెటీరియల్ వాడటం వల్లే ప్రమాదం

శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో బ్యాటరీలు మార్చుతుండగా 20 ఆగస్టు 2020 రోజున అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తొమ్మిదిమంది చనిపోయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కాలిపోయిన నాలుగో యూనిట్ పునరుద్ధరణకు జెన్‌కో నడుం బిగించింది. 2021లో జర్మనీకి చెందిన వాయిత్ కంపెనీకి మరమ్మతు పనులను అప్పగించింది. తొలుత 2023 జూలైలో మరమ్మతు పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. అప్పటి నుంచి 19 రోజుల్లో 70 గంటలు నడిచి 11.60 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేశారు. 2023 ఆగస్టు 17న స్టేటర్ బార్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో సమస్య మొదటికొచ్చింది. సదరు కాంట్రాక్టు సంస్థ జెన్‌కో సక్రమంగా రన్ చేయకపోవడంతోనే షార్ట్ సర్క్యూట్ అయ్యిందని తప్పించుకునే ప్రయత్నం చేసింది.

జెన్ కో యాజమాన్యం నిపుణుల కమిటీతో విచారణ చేయించగా మరమ్మతు పనులలో నాసిరకం మెటీరియల్ వాడటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని నివేదిక ఇచ్చింది.

దీంతో వాయిత్ కంపెనీ కాంట్రాక్టు లైసెన్స్‌ను బ్లాక్ లిస్టులో పెట్టినట్లు అప్పట్లో జెన్ కో ప్రకటించింది.

కల్వకుర్తికి మిషన్ భగీరథ అడ్డంకి

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉన్న మొదటి పంపుహౌజ్ 2020 అక్టోబరులో మునిగిపోయింది. ఇందులో ఐదు పంపులు ఉండగా 3, 5 నెంబరు పంపులు దెబ్బతిన్నాయి. అప్రోచ్ కెనాల్ వద్ద షట్టర్లు ఏర్పాటు చేయకపోవడం, శ్రీశైలం బ్యాక్ వాటర్ ఒత్తిడి ఎక్కువ కావడంతో పంపుహౌజ్‌లో 50 మీటర్ల మేర నీరు చేరింది. ఇది జరిగి ఇప్పటికి ఐదేళ్లు పూర్తయినా ఆ మోటార్ల మరమ్మతు పూర్తి కాలేదు. మోటార్ల మరమ్మతు బాధ్యతను బీహెచ్ఈఎల్ చేపట్టగా కేవలం నెల రోజుల్లో పూర్తయ్యే పని ఐదేళ్లు గడిచినా కావడం లేదు. మరమ్మతు పూర్తిచేయాలంటే సర్జ్‌పూల్‌లోకి నీరు రాకుండా నియంత్రించాలి. కానీ, 2020 నుంచి కృష్ణానదికి వరద తాకిడి ఎక్కువగా ఉంటోంది. 2023లో తక్కువ వరద వచ్చినప్పటికీ ఆ సంవత్సరం మరమ్మతు పనులను పట్టించుకోలేదు. మిషన్ భగీరథ పథకానికి ఈ సర్జ్‌పూల్‌ను ఉపయోగించడం వల్ల మోటార్ల మరమ్మతుకు అవకాశం ఉండటం లేదని అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి మిషన్ భగీరథ పథకానికి పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్మించిన అంజనగిరి రిజర్వాయర్ నుంచి నీటిని అందించాలి. అది పూర్తికాకపోవడంతో ప్రత్యామ్నాయంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని వాడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన అంజనగిరి రిజర్వాయర్‌ను పూర్తిచేస్తే కల్వకుర్తి సర్జ్‌పూల్‌లోకి నీటిని రాకుండా అడ్డుకొని మోటార్లను రిపేర్ చేయవచ్చు. ప్రస్తుతం నీరు రాకుండా చేయాలంటే మిషన్ భగీరథ పథకానికి సరఫరా నిలిచిపోయి అప్రతిష్ట మూటకట్టుకోవాల్సి వస్తుందని ప్రభుత్వం వెనుకడుగు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

పాత పద్ధతి జీవో ద్వారా
బీసీలకు అన్యాయం

» బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవింద స్వామి


జీవో కాపీలను దహనం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

వనపర్తి టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన పాత పద్ధతి జీవో ద్వారా బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవింద స్వామి అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు జీవో నెంబరు 46 కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోకు ముందు కామారెడ్డి డిక్లరేషన్ చేసి మాట తప్పిందన్నారు. రాష్ట్రంలోని రెండున్నర కోట్ల మంది బీసీలను రేవంత్‌రెడ్డి మోసం చేశాడని, పార్టీలకతీతంగా బీసీలంతా ఏకమై హక్కులు సాధించుకోవాలన్నారు. బీసీలను నమ్మించి మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో తిరగనివ్వకుండా బొంద పెడతామని హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు శివకుమార్, విరాట్, వాకిటి రమేష్, శ్రవణ్ కుమార్, చందు ముదిరాజ్, రాములు యాదవ్, యాదయ్య గౌడ్, రాజు, తిరుమలేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు భౌరాపూర్ పెంటకు
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

మన్ననూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అభయారణ్య ప్రాంతంలోని భౌరాపూర్ పెంటలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సోమవారం పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగిశెట్టి నాగరాజు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నల్లమలలో నిర్మించిన ఇకో ఫ్రెండ్లీ (పర్యావరణ హిత) గృహాలను మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి పరిశీలిస్తారని తెలిపారు. చెంచు యువకులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అదేవిధంగా బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాలను భౌరాపూర్ పెంటలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అమ్రాబాద్, పదర మండలాలకు చెందిన బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

అమరుడు పురుషోత్తం

» ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా వర్ధంతి సభ


పురుషోత్తం వర్ధంతి సభలో పాల్గొన్న సామాజికవేత్తలు

అయిజ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తం అమరుడని, ఆయన జనం మధ్యలో లేకపోయినా జనం గుండెల్లో ఉన్నాడని జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు సుభాన్ అన్నారు. ఆదివారం అయిజ మండల పరిధిలోని చిన్నతాండ్రపాడులో పౌరహక్కుల సంఘం నాయకులు పురుషోత్తం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాల్గొని మాట్లాడారు. పురుషోత్తం విద్యార్థి దశ నుంచి పోరాటాలు ప్రారంభించి ప్రజా ఉద్యమంలో పనిచేస్తూ ఆదర్శ యువజన సంఘాలు ఏర్పాటు చేసి గ్రామ యువకులను చైతన్యం చేశారని అన్నారు. దళితుల రెండు గ్లాసుల విధానానికి వ్యతిరేకంగా, ఎల్కూర్లో పెత్తందారులకు వ్యతిరేకంగా, మల్లందొడ్డిలో పూర్వ కృష్ణ హత్యకు వ్యతిరేకంగా సభలు నిర్వహిచి సవాల్ విసిరిన ప్రజానాయకుడు అని కొనియాడారు. ఆపరేషన్ కగార్ పేరిట ఎన్‌కౌంటర్లలో ఆదివాసిలను, ఉద్యమకారులను హతమార్చటం వ్యతిరేకిస్తూ సభ నిర్వహించారు. విజయభాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు శంక ప్రభాకర్, నాగరాజు, గోపాల్, రాజు, కిశోర్‌కుమార్, రామన్ గౌడు, రవీంద్ర, మహేష్, జ్యోతి, స్వేచ్ఛ, సత్తన్న పాల్గొన్నారు.

రైతులపై రాజకీయం వద్దు

» మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే విజయుడు


అలంపూరు చౌరస్తాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, మార్కెట్ చైర్మన్ దొడ్డెప్ప,ఇతర నాయకులు, అధికారులు

అలంపూరుచౌరస్తా, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతుల విషయంలో రాజకీయం చేయకండని మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెప్పతో ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఉండవల్లి మండల పరిధిలోని అలంపూరు చౌరస్తా మార్కెట్ యార్డులో మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లాలో 5వ కొనుగోలు సెంటర్ అని, తాజాగా కౌలు రైతులు పండించిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ మేనేజర్ చంద్రమౌళి అన్నారు. ఎమ్మెల్యే విజయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెప్ప, వైస్ చైర్మన్ కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారిణి పుష్పమ్మ, సెక్రటరీ ఎల్లస్వామి హాజరయ్యారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు సెంటర్లలోనే అమ్మాలని దళారులను నమ్మి మోసపోవద్దని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పీఏసీఎస్‌ల సమక్షంలో కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయగా, ఇక్కడ మాత్రం మార్కెట్‌శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు చేయడం రాజకీయ కక్షేనని దుయ్యబట్టారు. రైతుల విషయంలో రాజకీయం చేయరాదని సూచించారు. కలుగొట్ల పీఏసీఎస్ చైర్మన్ బీఆర్ఎస్ నాయకుడు కావడంతోనే కొనుగోలు సెంటర్ ఏర్పాటుకు ఆలస్యం చేస్తూ ఏఎంసీకి అప్పగించారన్నారు. రైతుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని దొడ్డెప్ప అన్నారు. రైతుల విషయంలో రాజకీయం చేయదలంలేదని ఇది రైతు పక్షపాతి ప్రభుత్వం అన్ని అన్నారు. కార్యక్రమంలో గజేందర్‌రెడ్డి, రంగారెడ్డి, ఆర్ కిషోర్, సుధాకర్‌రెడ్డి, సత్యానారాయణ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

స్పిన్నింగ్ మిల్లు ప్రమాదంలో మరో కార్మికుడి మృతి


దేవరాజు (ఫైల్)

జడ్చర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపల్లి సమీపంలోని సలాసర్ స్పిన్నింగ్ మిల్లులో జరిగిన అగ్ని ప్రమాదంలో చికిత్స పొందుతూ ఆదివారం మరొకరు మృతి చెందాడు. మంగళవారం షాట్‌సర్క్యూట్‌తో స్పిన్నింగ్ మిల్లులో పత్తి అంటుకోవటంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన వారిలో చికిత్స పొందుతూ ఆదివారం దేవరాజు (27) మృతి చెందాడు. మృతుడిది ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాగా, భార్య, 20 రోజుల కూతురు ఉంది. మరో కార్మికుడు చికిత్స పొందుతున్నాడు. మృతి చెందిన దేవరాజు కుటుంబానికి యాజమాన్యం రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగుసత్తయ్య డిమాండ్ చేశారు.

భవనంపై నుంచి కింద పడి వ్యక్తి మృతి


నరసింహ (ఫైల్)

కొల్లాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి ఓ కూలీ మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్‌లో ఆదివారం ఈ సంఘటన జరిగింది. పట్టణంలోని తెలుగువీధికి చెందిన జలకం నరసింహ (46) వృత్తి రీత్యా మత్స్యకారుడు కాగా, కుటుంబ పోషణ కోసం ఇళ్లలో బండలు వేసే పని చేస్తున్నాడు. అలాగే ఆదివారం పట్టణంలోని నిర్మాణంలో ఉన్న భవనం పై అంతస్తుకు బండలను మోస్తూ ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. వెంటనే భవనం యజమాని, తోటి కూలీలు అతడిని కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ మరొకరు..

కోడేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, కోడేరు మండలంలోని ఎత్తం గ్రామానికి చెందిన పల్లెపు వడ్డె విష్ణు (45) హైదరాబాద్‌లో వాచ్‌మన్ డ్యూటీ చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో భార్యాభర్తలు తరుచూ గొడవ పడేవాడు. ఈనెల 14న స్వగ్రామానికి వచ్చిన విష్ణు పురుగుల మందు తాగాడు. విషయాన్ని కుటుంబ సభ్యుడు రాములుకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అతడిని కొల్లాపూర్ ఆసుపత్రికి, ఆ తర్వాత మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విష్ణు మృతి చెందాడు. ఆయనకు భార్య పార్వతమ్మ, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి వల్లెపుపెద్ద వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న కారు

» ఇద్దరికి గాయాలు

అమరచింత, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు అదుపుతప్పి కారు చెట్టుకు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన శనివారం మధ్య రాత్రి వనపర్తి జిల్లా అమరచింత మండల శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ పట్టణానికి చెందిన బాలరాజు శ్యాంసుందర్‌ను ఇద్దరు వ్యక్తులు ఆత్మకూరు వైపు నుంచి మక్తల్ వెళ్తుండగా అమరచింత శివారులో కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమై ఇరువురి కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. అట్నుంచి వెళ్లే వాహనాలు ఆపి ఇరువురిని కారులో నుంచి అతి కష్టం మీద బయటకు తీసి 108కి సమాచారం అందించారు. అమరచింత 108 సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స నిర్వహించి మక్తల్ ఆసుపత్రికి తరలించారు.

బాలికపై అఘాయిత్యం

» యువకుడిపై పోక్సో కేసు

అచ్చంపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదయ్యింది. నాగర్‌కర్నూలు జిల్లాలోని ఓ పట్టణానికి చెందిన 28 ఏళ్ల యువకుడు, 17 ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. సంఘటనపై బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో, యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సద్దాం హుసేన్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో చెంచు మహిళ మృతి

» హత్య అని కుటుంబ సభ్యుల ఆరోపణ

» కేసు నమోదు చేసిన పోలీసులు

కొల్లాపూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కరూల్‌జిల్లా కొల్లాపూర్ మండం మొలచింతలపల్లి గ్రామంలోని భ్రమరాంబ చెంచు కాలనీలో ఆదివారం ఉదయం చెంచు మహిళ కాత్రాజు ఎల్లమ్మ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె ఫాన్ కొండికి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా, ఆమె మృతిపై ఆమె అక్క అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో కాత్రాజ్ ఎల్లమ్మ, వీరస్వామి భార్యాభర్తలు. వీరస్వామి కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వీరికి నలుగురు పిల్లలు. పెద్ద అమ్మాయికి పెళ్లి కాగా మిగతా ఇద్దరు కుమారులు ఒక అమ్మాయి చెంచు కాలనీలోనే ఉంటారు. ఇదిలా ఉండగా, కొన్ని నెలలుగా అదే చెంచు కాలనీలో నివాసం ఉండే చెంచు చంద్రయ్య అలియాస్ చిన్నయ్య కాత్రాజ్ ఎల్లమ్మతో సహజీవనం చేస్తూ, ఆ ఇంట్లోనే ఉంటాడు. ఈ తరుణంలో అప్పుడప్పుడు చిన్నయ్య భార్య చిన్న ఎల్లమ్మతో గొడవలు జరిగేవి. కొద్ది రోజుల క్రితం జీవనోపాధి నిమిత్తం అడవికి వెళ్లి తిరిగి వచ్చి శనివారం కాత్రాజ్ ఎల్లమ్మ, చిన్నయ్య ఇంట్లోనే ఉన్నారు. చంద్రయ్య భార్య చిన్న ఎల్లమ్మ, కాత్రాజ్ ఎల్లమ్మలు కలిసి శనివారం మద్యం సేవించారని తెలిసింది. ఆదివారం ఉదయం చంద్రయ్య ఇంట్లో ఉన్న ఫ్యాన్ రింగ్‌కు కాత్రాజ్ ఎల్లమ్మ కొంగుతో ఉరి వేసుకుని మృతి చెందినట్లు చెంచు కాలనీలో పుకార్లు రేకెత్తాయి. అయితే కాత్రాజ్ ఎల్లమ్మ మృతిపై ఆమె అక్క చిట్టెమ్మ అనుమానం వ్యక్తం చేస్తూ ఆమెను హత్య చేశారని, దీనిపై విచారణ చేపట్టాలని కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు చెంచు కాలనీకి చేరుకొని మృతదేహాన్ని కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చిన్నయ్య పరారీలో ఉన్నట్లు చెంచులు పేర్కొన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి


సమావేశంలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కె. రాజేశ్ రెడ్డి

తెలకపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఇందిరా శక్తి చీరల కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మాజీ ఎంపీపీ బండ పర్వాతలు, సింగల్ వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, మాజీ జడ్పీటీసీ సుమిత్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మహిళా సంఘాల సభ్యులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గమ్యం చేరాలంటే.. పట్టాలు దాటాల్సిందే


పాల్‌టెక్నిక్ కళాశాల ప్రాంతంలో రైలు పట్టాలు దాటుతున్న విద్యార్థులు

» నిర్మించిన ఆరు నెలల్లోనే కుంగిన రైల్వే అండర్ బ్రిడ్జి

» పరిశీలించి మూసివేసిన అధికారులు

» ఇబ్బంది పడుతున్న నగర వాసులు


ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు కుంగి పోయిన రైల్వే బ్రిడ్జిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, మునిసిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి (ఫైల్)

మహబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గమ్యస్థానం చేరాలంటే పట్టాలు దాటక తప్పడం లేదు. మహబూబ్‌నగర్ పట్టణంలోని 12, 13 వార్డుల పరిధిలో, గిర్నిగడ్డ, పాల్‌టెక్నిక్ కళాశాల సమీపంలో రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జి నిర్మించారు. నాణ్యతా లోపంతో నిర్మించడంతో ఆరు నెలలు గడవక ముందే, ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు ఓవర్ బ్రిడ్జి కోసం వేసిన షెడ్లు కుంగిపోయాయి. విషయం తెలుసుకున్న కలెక్టర్ విజయేందిరా బోయి, నగర కమిషనర్ ప్రవీణ్ రెడ్డి బ్రిడ్జిని పరిశీలించారు. ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు అండర్ బ్రిడ్జిలో నుంచి రాకపోకలు సాగకుండా చర్యలు తీసుకున్నారు. దీంతో ఈ దారిలో వెళ్లే ప్రజలు, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పట్టాలు దాటి వెళ్లాల్సి వస్తోంది.

నాసిరకంగా బ్రిడ్జి నిర్మాణం

రైల్వే అండర్ బ్రిడ్జిని కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించడం వల్లే కొద్ది నెలలకే దెబ్బతిన్నది. చుట్టూ ఉన్న పంట పొలాల నుంచి నిత్యం ఊట నాటితో పాటు, మునిసిపల్ డ్రైనేజీ నీరు కూడా అండర్ బ్రిడ్జిలో చేరుతుంది. ఆ నీటిని మోటార్లతో తోడిపోసినా, కొన్ని గంటల్లోనే రెండు నుంచి మూడు అడుగుల మేర నీరు చేరుతోంది. ఈ విషయాన్ని అంచనా వేయకుండా రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించడం సమస్యగా మారింది. కలెక్టర్ పరిశీలించి, సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు.

చుట్టూ తిరిగి ప్రయాణం

అండర్ బ్రిడ్జి సమీపంలోని లంక కాలనీ, గొల్లబండ తండా, గిర్నగడ్డ ప్రాంత ప్రజలు, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రోడ్డు ఇవతలకు రావలంటే అండర్ బ్రిడ్జి కింది నుంచి వస్తే, 100 మీటర్ల దూరం ప్రయాణిస్తే రాయచూర్ రోడ్డు పైకి చేరుకుంటారు. కానీ బ్రిడ్జి కింద నుంచి రాకపోకలు బంద్ కావడంతో చుట్టూ తిరిగి 3 నుంచి 4 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది.

అత్యవసరం అయితే పట్టాలు దాటి వెళ్లాల్సి ఉంటుంది. అయితే సమీపంలోని పొలాల్లో గొర్రెలను, మేకలను మేపేందుకు వెళ్లే కాపరులు త్వరగా గమ్య స్థానం చేరేందుకు పట్టాల మీదుగా వెళ్తుంటారు. ఒక వేళ వచ్చే రైలును గమనించకపోతే ప్రమాదాలు జరుగొచ్చని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నరక యాతన



అండర్ బ్రిడ్జి కుంగి పోవడంతో రాకపోకలను బంద్ చేశారు. తండా నుంచి నగరానికి రావాలంటే నరక యాతన తప్పడం లేదు. ఆటో లు, ఇతర వాహనాలు రాకపోవడంతో నిత్యం కాలి నడకనే కిలోమీటర్ల కొద్దీ నడిచి చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది.

\- రాజు, గొల్లబండ తండా

పనులకు వెళ్లాలంటే భయం



పొలం పనుల నిమిత్తం తండాకు గానీ, లంకకు గానీ వెళ్లలంటే భయంగా ఉంది. ఎప్పుడు రైలు వస్తుందోనని భయం భయంగా రైలు పట్టాలు దాటి వెళ్తున్నాం. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలి.

\- సత్యమ్మ, బండమీదిపల్లి

మూగ జీవాలకు ఇబ్బంది



బండమీదిపల్లి, గిర్నిగడ్డ, జమ్ములమ్మనగర్ కాలనీల నుంచి గొర్రెలు, మేకలను మేపేందుకు రైలు పట్టాలు దాటి వెళ్తాం. అండర్ బ్రిడ్జికి మరమ్మతు చేయిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. రైల్వే శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

\- రాములు, బండమీదిపల్లి

రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవాలి

» జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్

» ఉత్సాహంగా జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు


కబడ్డీ క్రీడాకారులతో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ అన్నారు. కరీంనగర్ జిల్లాలో డిసెంబరు 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ టోర్నీలో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో నిర్వహించారు. జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. శిక్షణ శిబిరం నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముత్యం, రామచంద్రయ్య, వేణుగోపాల్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నర్సింహులు, శ్రీనివాసులు, పాపరాయుడు, గణేష్, అబ్రాహం, మల్లేష్, మమత

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

» వాలీబాల్ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య

» ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక


వాలీబాల్ క్రీడాకారులతో వాలీబాల్ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వాలీబాల్‌లో జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని వాలీబాల్ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య అన్నారు. రాజన్న సిరిసిల్ల ఈ నెల 29 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్న 8వ రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలు ఆదివారం స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఎంపికలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్రస్థాయి టోర్నీలో ఉమ్మడి జిల్లా విజేతగా నిలవాలని, జిల్లా క్రీడాకారులు ప్రతిభ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. శిక్షణ శిబిరం నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాజీర్, నరసింహ, రాజు, దస్తగీర్‌ఖాన్, పాష, కోచ్ పర్వేజ్‌పాష పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

» అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వాములు


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ సోలపోగుల స్వాములు, నాయకులు

కల్వకుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు కోరారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించారు. క్రీడలను స్వాములు ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు మానసిక, శారీరక మేధోపరమైన అభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. క్రీడల్లో 150మంది బాలురు, బాలికలు పాల్గొన్నారు. 2కి.మీ, 4కి.మీ, 6కి.మీ, 8కి.మీ, 10కి.మీ విభాగాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బంగారు, వెండి, కాంస్య పతకాలు, ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. వీరు వచ్చే జనవరి 4న హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి మెయిన్ అథ్లెటిక్స్ స్టేడియంలో జరగబోయే 11వ తెలంగాణ స్టేట్ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భిక్షపతియాదవ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ డైరెక్టర్ ప్రసాద్, కోచ్‌లు, డైరెక్టర్లు మల్లేష్, జ్యోతి, అరుణ, జాఫర్, జోన్సీ, శ్రీనివాస్, చంద్రశేఖర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే మాజీ సర్పంచ్ హత్య?

» నెలరోజులుగా రెక్కీ

» పోలీసుల అదుపులో సుపారీ నిందితులు

» శోకసంద్రం నడుమ మాజీ సర్పంచు అంత్యక్రియలు


నందిన్నె గ్రామంలో మాజీ సర్పంచు అంత్యక్రియల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

ధరూరు/ కేటిదొడ్డి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో రెండ్రోజుల క్రితం కేటిదొడ్డి మండలం నందిన్నె గ్రామ మాజీ సర్పంచు చిన్న భీమరాయుడు హత్యోదంతం జిల్లాలో సంచలనం సృష్టించింది. కేవలం రోడ్డు ప్రమాదం అనుకున్న ఈ ఘటన వెనుక రాయలసీమ సుపారీ గ్యాంగ్ హస్తమున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పక్కా పథకం ప్రకారమే నెలరోజుల ముందు నుంచే హత్యకు పథకం రచించినట్లు తెలిసింది. బైక్‌పై వెళ్తున్న చిన్న భీమరాయుడును ధరూర్ మండలం జాంపల్లి గ్రామం వద్ద వెనుక నుంచి బొలెరో వాహనంతో ఢీకొట్టి, 250 మీటర్లు ఈడ్చుకు వెళ్లి హత్య చేసినట్లు తెలుస్తుంది.

మృతుడికి గ్రామంలో ఉన్న భూమి వ్యవహారంతో పాటు రైస్‌మిల్ యజమానితో పలువివాదాలు, గ్రామంలో పాతకక్షలు, వ్యాపార పరంగా వైరం ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ క్రమంలోనే హత్య జరిగినట్లు తెలుస్తున్నది. కాగా ఇప్పటికే పోలీసుల అదుపులో నలుగురు సుపారీ గ్యాంగ్ నిందితులను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, విచారణ చేస్తున్నట్లు సమాచారం.

అంత్యక్రియలు పూర్తి

మాజీ సర్పంచు చిన్న భీమరాయుడు అంత్యక్రియలు ఆదివారం నందిన్నె గ్రామంలో కుటుంబ సభ్యుల శోకసంద్రం నడుమ పూర్తయ్యాయి. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు బాసు హనుమంతునాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, వేల మంది హాజరయ్యారు. డీఎస్పీ మొగులయ్య ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. చిన్న భీమరాయుడు మృతిపై కేసు విచారణ పూర్తిస్థాయిలో, అన్నికోణాల్లో చేపట్టి, వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు.

పోస్టర్ డిజైన్‌లో రాష్ట్రస్థాయి విజేతగా విష్ణువర్ధన్

» గవర్నర్ చేతుల మీదుగా సన్మానం


విష్ణువర్ధన్‌ను సన్మానిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ

మిడ్జిల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాజ్‌భవన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ నార్త్ ఇస్ట్ కానెక్టు కార్యక్రమం కోసం నిర్వహించిన పోస్టర్ డిజైన్ పోటీలో మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ రాష్ట్రస్థాయి విజేతగా నిలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన అనే ఎంట్రీలలో విష్ణువర్ధన్ రూపొందించిన చిత్రం ఎంపికైనట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, ఉత్తర తూర్పు రాష్ట్రాల మధ్య సాంస్కృతిక మార్పిడి, వ్యాపార- వాణిజ్య అనుసంధానం, విద్య- ఉపాధి అవకాశాల పురోగతిని బలోపేతం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. శనివారం కొండాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ చేతుల మీదుగా ప్రసంసా పత్రంతో పాటు నగదు బహుమతిని అందుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి విష్ణువర్ధన్‌ను అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు పెద్దమందడి విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని కొత్త పూజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దమందడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19న నాగర్‌కర్నూల్ జిల్లా తూడుకుర్తిలో జరిగిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 ఖోఖో టోర్నమెంటులో వనపర్తి జిల్లా తరపున పాల్గొని ప్రతిభ కనబరిచి ఈ నెల 23, 24, 25 తేదీలలో నల్గొండ జిల్లా చౌటుప్పల్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్- 17 ఖోఖో టోర్నమెంటుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న కొత్త పూజ ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శాంతన్న, ఫిజికల్ డైరెక్టర్ మన్యంయాదవ్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని ఏఏపీసీ చైర్మన్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు క్రికెట్ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి గోల్డ్ కప్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాలుర జట్టు ఎంపికలను ఈనెల 25న శ్రీనివాసకాలనీలో గల జీకే క్రికెట్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు టీసీఏ జిల్లా సెక్రటరీ ప్రేమ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-23, ఆపై విభాగాల్లో ఎంపికలు ఉంటాయని ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు.

నిలిచిన జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు ,నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద నిలిచిన కారణంగా విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్‌ఈ శ్రీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నాలుగు నెలల పాటు నిర్విరామంగా విద్యుత్ ఉత్పత్తిని చేపట్టి 1000మిలియన్ యూనిట్లకు పైగా సాధించామని తెలిపారు. ఎగువ నుంచి వరద తగ్గుముఖం పట్టడంతో విద్యుత్ ఉత్పత్తిని నిలిపేశామని తెలిపారు. 1000 మిలియన్ యూనిట్లను సాధించడం ప్రాజెక్టుల చరిత్రలోనే ఇదే మొదటిసారి అని ఆయన గుర్తు చేశారు. అందరి సహకారంతో అత్యధిక ఉత్పత్తిని చేపట్టామని తెలిపారు.

ఇంటర్వ్యూ..

ఉపాధి హామీ పనులకు గ్రామాల్లో ప్రణాళికలు సిద్ధం

- సత్యనారాయణ, ఏపీవో



తిమ్మాజిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2026-27 సంవత్సరానికి గాను గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఏపీవో సత్యనారాయణ తెలిపారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు.

ప్రణాళికలు ఎలా తయారు చేస్తున్నారు ?

గ్రామాల్లో ముందు రోజు దండోరా వేయించడం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రైతులను సమావేశపరిచి పనులను గుర్తిస్తూ మొదటి గ్రామసభ జరిగిందని ప్రస్తుతం 12 గ్రామాల్లో రెండవ గ్రామసభను నిర్వహించి బడ్జెట్ వివరాల పనుల వివరాలను చర్చించడం జరిగిందని ప్రణాళికలు సిద్ధం చేశాం.

ఏఏ పనులు గుర్తిస్తున్నారు ?

బీడు భూముల అభివృద్ధి పండ్ల తోటల పెంపకం రైతులకు సంబంధించిన వ్యవసాయ పొలాలు చదును చేయడం వాళ్లు కట్టలు నిర్మించడం పాంపాండ్ల తోటలు వేయడం కంపచెట్లు తొలగించడం పనులో పాటుగా జామ, మామిడి, సపోటా తదితర చెట్లను పెంచడం, ప్రభుత్వ అనుమతులతో పశువుల కొట్టాలు నిర్మిస్తాం.

గతంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలకు ఏ విధమైన సంరక్షణ చేయిస్తున్నారు?

గ్రామ పంచాయతీ సహకారంతో ప్రస్తుతం మొక్కలకు నీరు పట్టడం, కలుపు తొలగించడం వంటి పనులు చేస్తూ మొక్కలను సంరక్షిస్తున్నాం.

న్యూస్ బాక్స్

శ్రీకృష్ణ దేవరాయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న డాక్టర్ అనురాధ



పూజలు చేస్తున్న డాక్టర్ అనురాధ

మన్ననూర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ స్థాపనోత్సవ కార్యక్రమానికి సీబీఎం ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ ఆదివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర పాలక మండలి డైరెక్టర్ సంభు శోభ, కాంగ్రెస్ నాయకులు రేణయ్య, సుజాత పాల్గొన్నారు.

'ఏకలవ్య విగ్రహం ఏర్పాటుకు కృషి చేయాలి'

లింగాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన లింగాలలో ఏకలవ్య కాంస్య విగ్రహ ఏర్పాటుకు ఆదివారం ఎరుకల సంఘం ముఖ్య నాయకులు సన్నాహక సమావేశం మండల ఎరుకల సంఘం అధ్యక్షుడు మల్లె పరమేశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఏకలవ్యుడు త్యాగానికి ప్రతీక అని, గురువు లేకున్నా విలు విద్యలో రాణించిన తీరు యావత్తు ప్రపంచాన్ని అబ్బురపరిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు కేటీ తిరుపతయ్య, చిత్తూరు ఇందిరమ్మ, విజయలక్ష్మీ, అరవిందు, అచ్చంపేట ఎరుకల సంఘం నాయకులు పోల మల్లయ్య, కావేటి భాస్కర్, మానుపాటి పాండు, లింగాల మాజీ సర్పంచ్ కోనేటి తిరుపతయ్య, మాజీ ఎంపీటీసీ పీర్యా, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మరికల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ వార్డు మెంబరు మనేమోని శేఖర్, బీఆర్‌ఎస్ కార్యకర్త ఏడుపుల రంగస్వామి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీని వీడి పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకులు మడ్డీమాన్‌గౌడ్, మాజీ సర్పంచ్ పుట్ట కృష్ణవేణి, రాములు, మాజీ వార్డు నెంబరు పుట్ట చిన్నయ్య, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు పుట్ట రమేష్, మారోజు నరేంద్రచారి, మారేడు నారాయణ పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల బలోపేతానికి కృషి

కోడేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చేపల పెంపకంతో మత్స్యకారుల అభివృద్ధికి దోహదపడుతుందని మత్స్యకారుల సహకార సంఘం సభ్యుడు చొప్పరి పెద్ద బాలపీరు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కుంటలలో దాదాపు రెండు లక్షల ఐదువేల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి విరివిగా నిధులు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్‌యాదవ్, చామంఞ రాజు, సూపర్‌పెద్ద బాలపేరు, సొప్పరి తిరుపతయ్య, కాకం శివయ్య, సొప్పరి అంజనేయులు, కాకం రాముడు, బాలస్వామి పాల్గొన్నారు.

కంచె కరువు

- ప్రమాద భరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



విద్యుత్ షాకుతో మృతి చెందిన రెండు గొర్రెలు (ఫైల్)



ఉప్పునుంతలలో కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఉప్పునుంతల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నిత్యం ఎక్కడో ఒక చోట విద్యుత్ షాక్‌తో ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతున్న సంఘటన ఈ మధ్య కాలంలో చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్ శాఖ అధికారులకు మాత్రం తమకు పట్టనట్టుగా గ్రామాలలోని ఇళ్ల మధ్య ప్రభుత్వం కార్యాలయాల వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు మండలంలో వినిపిస్తున్నాయి. మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని పాలశీతలీకరణ, మండల ఎమ్మార్సీ భవనం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కానీ, దాని చుట్టూ కంచె ఏర్పాటు చేయ లేదు. ప్రతీ రోజు పదుల సంఖ్యలో పాలశీతలీకరణకు, మండల ఎమ్మార్సీ భవానికి ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారని ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల కితం పాలశీతలీకరణ కేంద్రం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు రెండు గొర్రెలు తగిలి మృతి చెందిన సంఘటన ఉన్నాయని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి గ్రామాలలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కంచె ఏర్పాటు చేయాలి



విద్యుత్ ట్రాన్స్‌పార్మర్స్ దగ్గర ప్రమాదాలు జరగకుండా గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌పార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేసే బాగుంటుంది. ప్రమాదాలు నివారించవచ్చు అదే విధంగా ట్రాన్స్‌పార్మర్ల దిమ్మెలు ఎత్తుగా కట్టే విధంగా విద్యుత్ శాఖ అధికా రులు చూడాలి. - గాంసీరామ్

ఘనంగా సత్యసాయిబాబా శతజయంతి

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

కందనూలు/ తెలకపల్లి/ మన్ననూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని భగవాన్ సత్యసాయి మందిరంలో సత్యసా యిబాబ శతజయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవా రుజామున పట్టణంలో మహానగర, సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి విశేష ద్రవ్యాలతో సామూహిక అభిషేక పూజలు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హకీం విశ్వప్రసాద్ మాట్లాడుతూ బాబా శతజయంతి ఉత్సవాల్లో సేవా కార్యక్రమాల విశిష్టతను తెలిపారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సత్యసాయి అన్నప్రసాద హాల్‌లో బాబాకు హారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆసుపత్రిలో రోగులకు వస్త్రాలు, రగ్గులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. శ్రీసాయి ప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు హకీం మురళి, ప్రధాన కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్యలు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఆయన వెంట మార్కెట్ చైర్మన్ రమణారావు, కార్యకర్తలు ఉన్నారు. బాల వికాస్ విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ పూజారి రాజశేఖర్‌శర్మ, పలు విభాగాల కన్వీనర్లు స్వామికి మహామంగళహారతి సమర్పించారు.

తెలకపల్లిలో భగవాన్ పుట్టపర్తి సత్యసాయి బాబా శతజయంతి వేడుకలను పురస్కరించుకొని బాబా శిష్యుడు ఇరువేంటి రంగయ్య ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు.



తెలకపల్లి : పుట్టపర్తి సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి వందనం చేస్తున్న భక్తులు

అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో భగవాన్ సత్యసాయిబాబ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమామహే శ్వర పాలకమండలి డైరెక్టర్ సంభు శోభ, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్ రమణ, సాయి సేవాసమితి భక్తులు సంభు నరేష్, జూలూరి సత్యనారాయణ, పద్మజ, సుమతి, సరిత, స్వప్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి పల్లకీ సేవ

తిమ్మాజిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుమ్మకొండలో ఆదివారం భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి పల్లకి సేవ నిర్వహించారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా శుక్రవారం ఆలయంలో ఆంజనేయస్వామికిక ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి తమలపాకుల మాలను అలంకరించారు. భక్తులు పలు గ్రామాల నుంచి ఆలయానికి చేరుకుని అఖండ భజనలు చేయగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గురుప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రామకృష్ణ, హనుమంతురెడ్డి, శివ, అయ్యప్ప స్వాములు నరేందర్, సుమంత్, అశోక్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ

- ఘనంగా ఆర్‌ఎస్పీ జన్మదినం



నాగర్‌కర్నూల్‌లో ఆర్‌ఎస్పీ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న స్వేరో నాయకులు

కందనూలు/కల్వకుర్తి/ తెలకపల్లి/ వెల్దండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ 58వ జన్మదిన వేడుకలను జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు బండమీది కృష్ణ స్వేరో ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమం అనంతరం జిల్లా కోకన్వీనర్ గిద్ద విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్ యాదవ్‌లు పాల్గొని కేక్ కట్ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి స్వేరో నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ మబ్బు రాము, స్వేరో కోర్ జిల్లా కన్వీనర్ శివకుమార్, కోర్ కోకన్వీనర్ కుమార్, ఆనంద్ పాల్గొన్నారు. ● కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బీఆర్‌ఎస్ నాయకులు చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి తినిపించారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. వృద్ధులకు దుప్పట్లు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్, ఫుడ్‌కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మునిసిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యంలు పంపిణీ చేశారు. ● తెలకపల్లిలో డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఫిట్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి తోకల విష్ణువర్ధన్ యాదవ్, రెడ్డపాకుల శివశంకర్, ప్రవీణ్‌కుమార్ అభిమానులు పాల్గొన్నారు. ● వెల్దండలో బీఆర్‌ఎస్ నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదినోత్సవాన్ని బీఆర్‌ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ హాజరై స్థానిక నాయకులతో కలిసి కేక్‌కట్ చేశారు.

లేబర్‌కోడ్‌లు రద్దు చేసేదాకా పోరాడుతాం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కల్వకుర్తి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడులు రద్దు చేసే దాకా పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు తెలిపారు. ఆదివారం మోదీ బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్యలను ఖండిస్తూ కల్వకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వం 29కార్మిక చట్టాలను రద్దు చేసి వాటిస్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి నవంబరు 21 నుంచి అమలు చేయడానికి పూనుకున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి తక్షణమే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, శ్రీనివాసులు, బాల్‌రెడ్డి, చింతఆంజనేయులు, ఏపీ మల్లయ్య, యాదయ్య, చంద్రయ్య, బీరయ్య, నరేష్, కృష్ణ, బాలస్వామి, మల్లేష్, పెద్దయ్య యాదవ్, అంజయ్యగౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

వసతి గృహాల అభివృద్ధికి కృషి

- జిల్లా అధికారి ఉమాపతి



బల్మూరులో క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్సీ హాస్టల్ వార్డెన్

బల్మూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహాల్లో ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటూ వారిని విద్యావంతులుగా చేసే విధంగా కృషి చేస్తున్నామని జిల్లా ఎస్సీ, ఎస్టీ హాస్టల్ అధికారి ఉమాపతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. హాస్టల్ విద్యార్థులకు వన భోజనాలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆలేటి కృష్ణయ్య, సిబ్బంది అర్జున్, క్రాంతి, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

● చారకొండ (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ఆదివారం వార్డెన్ బాలరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు వనభోజన కార్యక్రమం నిర్వహించారు. వార్డెన్‌తో పాటు విద్యార్థులు సమీపంలోని చెట్ల కిందకు చేరుకొని పాటలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సామూహిక వనభోజనం చేశారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణకు డీసీసీ పదవిపై హర్షం



వంశీకృష్ణను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమ్రాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు మూడవసారి డీసీసీ అధ్యక్ష పదవి రావడంపై మండలంలోని కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ నాయకులు బాలింగంగౌడ్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు అశోక్, సురేష్‌గౌడ్, కోటి, నరేష్‌యాదవ్ తదితరులు వంశీకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

● మన్ననూర్ (ఆంధ్రజ్యోతి) : డీసీసీ అధ్యక్షుడిగా ముచ్చటగా మూడో సారి ఎన్నికవడం హర్షణీయమని ఉమామ హేశ్వరపాలకమండలి డైరెక్టర్ సంభు శోభ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంది హన్మంత్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు రహీం, మాజీ ఎంపీ టీసీ దాసరి శ్రీనివాసులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంభు వెంకట్ రమణ, జూలూరి సత్యనారాయణ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

● ఊర్కొండ (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఎంపిక పట్ల మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ ద్యాప నిఖిల్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అనుభవం కలిగిన నాయకుడి ఎంపికతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. రమేష్ నాయక్, అబ్దుల్ సమి ఉన్నారు.

● అచ్చంపేట (ఆంధ్రజ్యోతి) : డీసీసీ అధ్యక్షుడిగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను మూడో సారి నియమించడంపై నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మంత్రియానాయక్, మల్లికార్జున్, విష్ణువర్ధన్ రెడ్డి, రాజు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎనలేని సేవలంది స్తున్న ఎమ్మెల్యేకు పలు బాధ్యతలు ఇవ్వడంపై ఏఐసీసీ నాయకులకు వారు ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు.

స్వచ్ఛందంగా రోడ్డుకు మరమ్మతులు

బిజినేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు రోడ్లు పెద్ద పెద్ద గుంతల పడి ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. ప్రభుత్వ అధికారులు పట్టించుకోకపోవడంతో విసిగిపోయిన యువకులు తామే స్వచ్ఛందంగా ట్రాక్టర్‌తో మొరం తెచ్చి గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టారు. మండలంలోని ఖానాపూర్ గ్రామం నుంచి పాలెం గ్రామానికి వచ్చే ప్రధాన పంచాయతీ రాజ్ రోడ్డు భారీ వర్షాలకు గుంతలు పడి వాహనాల రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. యువకులు తట్ట, పార చేతబట్టి ట్రాక్టర్‌తో మొర్రం తీసుకొచ్చి గుంతలను పూడ్చి వేశారు. యువకులు చేసిన పనిని అభినందించారు.

అర్చకుడి మృతి

కోడేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉమామహేశ్వర ఆలయం ప్రధాన అర్చకుడు జంగం శంకరయ్య (85)మృతి చెందడంతో గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. ఆదివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శిష్యులు గ్రామ ప్రజలు ఎంతో విచారం వ్యక్తం చేశారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

- ఇందిరా మహిళా శక్తి యూనిఫామ్ చీరల పంపిణీలో ఎమ్మెల్యే వంశీకృష్ణ



చారకొండలో మహిళలకు చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

చారకొండ/ వంగూరు/ మన్ననూరు/ ఉప్పునుంతల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపాలనలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం అచ్చంపేట నియోజకవర్గంలోని చారకొండ, వంగూరు, మన్ననూరు, ఉప్పునుంతల మండలాల్లో ప్రభుత్వం నుంచి వచ్చిన ఇందిరా మహిళా శక్తి యూనిఫామ్ చీరల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. చారకొండలో ఎంపీడీవో శంకర్‌నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వంగూరులో ఇందిరమ్మ చీరలను మహిళలకు వంశీకృష్ణ పంపిణీ చేశారు. అనంతరం వంగూరులో వాల్మీకి సంఘం నూతన భవనానికి, మిట్టసదగోడులో రూ.63 లక్షలతో నిర్మిస్తున్న పాఠశాల నూతన భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. వాల్మీకి భవనానికి రూ. 10 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఉప్పునుంతలలోని స్త్రీ శక్తిభవనం ఆవరణలో మహిళా సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ చీరలను పంపిణీ చేశారు. ఆయా మండలాల్లో ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలను మహిళలకు ప్రవేశపెట్టి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం మూడవసారి డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో ఎమ్మెల్యే వంశీకృష్ణను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాలువాతో సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ డీఆర్డీవో రాజేశ్వరి, తహసీల్దార్ ఉమ, ఏపీఎం శ్రీనివాసులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాలరాంగౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్, మండల యూత్ ప్రసిడెంట్ గణేష్‌గౌడ్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గోరటి శివ, మాజీ జడ్పీటీసీ భీముడు నాయక్, మాజీ ఎంపీటీసీలు గ్యార లక్ష్మణ్, నరసింహారెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్, వంగూరు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నర్మద, డీపీఎం చెన్నయ్య, ఏపీఎం సైదులు, మాజీ సర్పంచ్ అల్వాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, క్యామ మల్లయ్య, హర్షిత్‌రెడ్డి, రమేష్‌గౌడ్, బొజ్జ కృష్ణారెడ్డి, వంగూరులో మండల అధ్యక్షుడు పెంకుల పర్వతాలు, సలేశ్వరం, బక్కయ్య, రమేష్, శ్రీను, ఉప్పునుంతలలో ఆలయ చైర్మన్ నర్సింహారావు, మాజీ జడ్పీటీసీ అనంత ప్రతాప్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు లలిత, ఏపీఎం బాలచంద్రయ్య, జిల్లెల జగత్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన చీరలు అందిస్తున్నాం

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి



బిజినేపల్లిలో మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

కందనూలు/ బిజినేపల్లి/ తిమ్మాజిపేట/ తాడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా చీరల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల నేతన్నలతో నేయించిన అద్భుతమైన డిజన్లతో కూడిన నాణ్యమైన ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తుందని అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం ఆయన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. గతంలో మాదిరిగా కాకుండా నాణ్యమైన చీరలు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. బిజినేపల్లి ఎంపీడీవో కార్యాలయ అవరణలో, తిమ్మాజిపేటలోని రైతు వేదికలో, తాడూరులో మహిళా సంఘాల సభ్యులకు చీరలను ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి చీరలను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతీ మహిళకు డిసెంబరు 9 వరకు చీరలను అందజేస్తామని ఎమ్మెల్యే అన్నారు. బిజినేపల్లిలో ఆర్డీవో సురేష్ కుమార్, ఎంపీడీవో కతలప్ప, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, మార్కెట్ డైరెక్టర్ వాల్యానాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు, చంద్రగౌడ్, హరీశ్‌రెడ్డి, నరేందర్ గౌడ్, వంగ రామన్‌గౌడ్, బాలపీరు, తిమ్మాజిపేటలో డీఆర్‌డీవో చిన్న ఓబులేష్, రాష్ట్ర టెలికాం శాఖ డైరెక్టర్ శ్రీనివాస్‌బహదూర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఏపీఎం నిరంజన్, సమాఖ్య అధ్యక్షురాలు అమృత పాల్గొన్నారు.

గోవింద క్షేత్రం దేవాలయ కమిటీ ఎన్నిక



తీగల సునేంద్రను సన్మానిస్తున్న ఆలయ పూర్వ కమిటీ సభ్యుడు

కందనూలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోత) : జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులో గల గోవింద క్షేత్రంలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా తీగల సునేంద్ర, ప్రధాన కార్యదర్శిగా ఎం.నాగరాజు, కోశాధికారిగా కందూరు బాలరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిగుళ్లపల్లి రమణకుమార్, అదనపు కోశాధికారిగా వి.కృష్ణమాచార్యులు, గౌరవ సలహాదారులుగా నర్సినీ దత్తాత్రేయలు, ఆకారపు విశ్వనాథం, మల్లిశెట్టి నరసింహతోపాటుమిగతా పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. పూర్వ కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం



తనిఖీ చేస్తున్న జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు

కందనూలు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్‌లో ఆదివారం నిర్వహించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 747 మందికి గానూ 706 మంది విద్యార్థులు హాజరయ్యారు. 41మంది గైర్హాజరయ్యారు. జడ్పీ హైస్కూల్ బాలుర, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్ పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు, పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



మల్లేశ్వరంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెంట్లవెల్లి నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లేశ్వరం గ్రామంలో శనివారం రాత్రి కృష్ణానది తీరాన ఐలాండ్ పనులు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహయాదవ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 48 కోట్లతో కృష్ణానది మధ్యలో ఉన్న ఐలాండ్ పనులు ప్రారంభించడం సంతోషమన్నారు. ఐలాండ్‌పై నిర్మించనున్న అభివృద్ధి పనులతో మల్లేశ్వరం ఎంతో అభివృద్ధి చెందుతుందని వారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలరాజు, డీష్‌రవి నరసింహ, కాటన్ రాజు పాల్గొన్నారు.

అధ్వానంగా బస్టాండు



మురుగునీటితో నిండిన పెంట్లవెల్లి ఆర్టీసీ బస్టాండ్

పెంట్లవెల్లి నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ అధ్వానంగా తయారైంది. గ్రామంలోని వివిధ కాలనీల నుంచి విడుదలైన మురుగునీరు బస్టాండ ఆవరణలోకి మురుగు నీరు చేరి కంపు వాసన వస్తుంది. బస్టాండ్ ఆవరణలో పిచ్చి మొక్కలు చెత్తాచెదారంతో అధ్వానంగా తయారైంది. ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు వెళ్లిన ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. దుర్వాసన కంపు కొడుతుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు చొరవ చూపి బస్టాండ్‌లో చెత్తాచెదారం మురుగునీటిని తొలగించాలని కోరుతున్నారు.